పాత నేరస్తుడిని అరెస్టు చేసిన పోలీసులు

కామారెడ్డి, ఫిబ్రవరి 22 : పాత అంతర్ జిల్లా నేరస్తుడు సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన అందోల్ నవీన్‌ను గురువారం అరెస్టు చేసి జైలుకు పంపినట్లు కామారెడ్డి పట్టణ సీఐ చంద్ర శేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీన జిల్లా కేంద్రంలోని ఇంటర్నేషనల్ హోటల్ పక్కన ఉన్న మహాలక్ష్మి టైల్స్ షాపులోకి రాత్రిపూట చొరబడి రూ.40 వేల నగదును దొంగిలించినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాత నేరస్తులపై నిఘా పెట్టి ఈ కేసును ఛేదించినట్లు పేర్కొన్నారు. ఈ నేరంతోపాటు ఈ నెల 16వ తేదీ ములుగు జిల్లా మేడారం గ్రామంలో ఒక కొబ్బరికొట్టు దుకాణంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నేరస్తుడి వద్ద నుంచి ఒక మోటర్‌సైకిల్, 1,96,000 రూపాయల నగదు స్వాధీనం చేసుకొని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచామని తెలిపారు. ఈ కేసును కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్ సిబ్బంది, సీసీఎస్ కామారెడ్డి సిబ్బంది కలిసి ఛేదించగా వీరిని సీఐ అభినందించారు.

ప్రజల అవసరాల కోసం అనుమతులు ఇవ్వాలి

బీర్కూర్ ఆర్ఐ సురేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ రఘు, బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 22 : బీర్కూర్ మండల ప్రజల ఇండ్ల అవసరాల కోసం ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని ఆర్ఐ సురేందర్‌రెడ్డికి ఎంపీపీ రఘు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా ఇసుక అనుమతులు లేక ఇండ్ల నిర్మాణాలు ఆగిపోయి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆర్ఐకు వివరించారు. ఇసుక అనుమతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సందీప్, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు శశికాంత్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రాజు, నాయకులు మన్నాన్, లయాక్, ధర్మా, అశోక్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

నస్రుల్లాబాద్/రామారెడ్డి, ఫిబ్రవరి 22 : బీర్కూర్ మండలంలోని అన్నారం గ్రామంలో నర్సరీలు, పల్లె ప్రకృతి వనాన్ని ఎంపీడీవో భారతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీలో పనులు కల్పించాలని, నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా రోజూ నీటిని పట్టించేలా చూడాలని గ్రామల కార్యదర్శికి సూచించారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోతే కొత్త మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మోహన్, కారోబార్ సాయిలు పాల్గొన్నారు.

రామారెడ్డి మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఉన్న నర్సరీని ఎన్ఆర్ఈజీఎస్ అధికారి ధర్మారెడ్డితో కలిసి ఎంపీడీవో సవితారెడ్డి గురువారం పరిశీలించారు. నర్సరీలో మొక్కలను ఎండ నుంచి కాపాడేందుకు షేడ్ నెట్లను ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తంచేశారు. గ్రామ కార్యదర్శి లావణ్యకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆక్వాకల్చర్ ఎంతో లాభదాయకం

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, ఫిబ్రవరి 22 : ఆక్వాకల్చర్ (చేపల పెంపకం) ఎంతో లాభదాయకమని, ఆ దిశగా సన్న, చిన్నకారు రైతులు, మహిళా సంఘాలను ప్రోత్సహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. కొర్ర మీను చేపలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉందని చెప్పారు. వ్యవసాయ క్షేత్రంలో కొంత స్థలంలో ట్యాంక్, ఫామ్‌పాండ్ ఏర్పాటు చేసుకోవడంతో అటు వ్యవసాయంతోపాటు ఇటు కొర్రమీను చేపల పెంపకం చేపట్టవచ్చని అన్నారు. ఏడాదిలో మూడు సార్లు ఆదాయాన్ని సంపాదించుకోవచ్చని చెప్పారు. వీటి నిర్మాణానికి నాబార్డు రూ.ఐదు లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. పరిశ్రమల శాఖ సహకారంతో ట్యాంక్, ఫామ్‌పాండ్ నిర్మాణానికి 35 శాతం సబ్సిడీ ఇస్తుందని అన్నారు. జిల్లాలో 16,957 మహిళా సంఘాల్లో 1,75,670 మంది సభ్యులున్నారని చెప్పారు. చేపల పెంపకానికి ముందుకొచ్చిన 656 ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి 63 యూనిట్లు గ్రౌండ్ చేశామన్నారు. జిల్లాలో వేయి యూనిట్లు గ్రౌండింగ్ లక్ష్యమని, ఆ దిశగా మహిళా సంఘ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో నాబార్డు సహాయ జనరల్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, డీపీఎం రమేశ్ బాబు, జిల్లా మత్స్య శాఖాధికారి వరదా రెడ్డి, ఆక్వా కల్చర్ సాంకేతిక సలహాదారు, ఏపీఎంలు, సీఏలు, మహిళా సమాఖ్య సభ్యులు, మత్స్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఎంసీసీ, ఎంసీఎంసీ, సీ-విజిల్, సువిధ, కంట్రోల్ రూమ్ కాల్ సెంటర్ సిబ్బందితో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత శాసనసభ ఎన్నికల్లో నియమించిన సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వహించారని ప్రశంసిస్తూ, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మరింత అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అంకిత భావంతో 8 గంటలు షిఫ్టు ప్రకారం పని చేయాలని అన్నారు. కోడ్ అమలులోకి వచ్చిన 24, 48, 72 గంటల్లో చేసే విధులపై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల పర్యవేక్షకుడు జ్యోతి, అనిల్ కుమార్, వివిధ బృందాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

కామారెడ్డి, ఫిబ్రవరి 22 : జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘ కళాభారతిలో శుక్రవారం ఉదయం 11 గంటలకు 2024-25 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సాధారణ సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియా సభ్యులు హాజరుకావాలని సూచించారు.

ఈద్గా నిర్మాణ పనులకు భూమిపూజ

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 22 : మండల కేంద్రంలో ఈద్గా నిర్మాణ పనులకు బీఆర్ఎస్ నాయకులు, మైనార్టీలు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు కంది మల్లేశ్ మాట్లాడుతూ.. ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలు మంజూరయ్యాయని, దీంట్లో భాగంగా భూమిపూజ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్, సాయిలు, ఫయాజ్, అజ్గర్ అలీ, సత్తార్, వసీమ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

షెడ్డు నిర్మాణానికి..

భిక్కనూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో అంతంపల్లి సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో షెడ్డు నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో నూతన షెడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, పాలక వర్గం సభ్యులు సీఈవో శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నవ్విస్తూ.. మాయం చేస్తూ..

- 'ఇంద్రజాలం'లో రాణిస్తున్న సంతోష్‌కుమార్
- నేడు ఇంద్రజాల దినోత్సవం

మ్యాజిక్ చేస్తూ చిన్న పిల్లలను నవ్విస్తున్న సంతోష్ కుమార్ (ఫైల్)

భిక్కనూరు, ఫిబ్రవరి 22: మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కుమ్మరి సంతోష్ కుమార్ ఇంద్రజాలికుడిగా రాణిస్తూ ప్రశంసలు పొందుతున్నాడు. అబ్రకదబ్ర.. అంతా గప్ చుప్ అంటూ మ్యాజిక్ చేస్తూ అందరినీ ఆకట్టుకుంటున్నాడు. కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతోష్‌కుమార్ గాయపడగా కాళ్లు, చేతులు విరిగాయి. దీంతో ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఆత్మ స్థైర్యంతో లక్ష్య సాధన కోసం కృషి చేశాడు. ఎన్నో అవమానాలను ఎదుర్కొని కళాకారుడిగా నిలదొక్కుకున్నాడు. మ్యాజిక్‌తోపాటు నటనా, మిమిక్రీ రంగంలోనూ రాణిస్తున్నాడు. ఇప్పటివరకు 8 షార్ట్ ఫిల్మ్‌లో యాక్టింగ్ చేయగా.. తెలుగురాష్ట్రాల్లో 1200కుపై గా ఇంద్రజాల ప్రదర్శనలు, ప్లాస్టిక్ నియంత్రణపై సుమారు జిల్లాలో ప్రదర్శనలు ఇచ్చాడు. హరితహారం, మూఢ నమ్మకాల నియంత్రణపై తన ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించాడు. సంతోష్‌కుమార్ జాతీయ గోల్డెన్ స్టార్ అవార్డు, రాష్ట్ర స్థాయి అబ్దుల్ కలాం అవార్డు, ఉత్తమ మెజీషియన్ అవార్డును అందుకొన్నారు.

కుంటలోపడి మహిళ మృతి

కామారెడ్డి రూరల్ , ఫిబ్రవరి 22 : ప్రమాదశాత్తు కుంటలో పడి ఓ మహిళ మృతి చెందిందని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన సుంకం విజయ(48) గురువారం ఉదయం 10 గంటలకు కల్లాపి చల్లేందుకు పేడ తీసుకురావడానికి పక్కనే ఉన్న రామేశ్వర్‌పల్లి శివారులో ఉన్న పల్లెవాని కుంట వద్దకు వెళ్లింది. పేడ తీసుకొని చేతులు శుభ్రం చేసుకోవడం కోసం కుంట వద్దకు చేరుకుంది. ప్రమాదశాత్తు కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న సింగిల్ విండో పాలకవర్గ సభ్యులు

భిక్కనూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన మాసుల రాజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జంగంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో మృతుడి భార్య మాసుల హంసకు జనతా ఇన్సురెన్స్ ద్వారా లక్ష రూపాయల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ సిద్ధరాములు, విండో వైస్ చైర్మన్ వాసు యాదవ్, డైరెక్టర్లు శివకుమార్, నర్సింహరెడ్డి, సీఈవో రమేశ్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

దోమకొండ, ఫిబ్రవరి 22 : ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గణేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, సైబర్ నేరాల బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

పైపు లీకేజీకి మరమ్మతులు

బీబీపేట్, ఫిబ్రవరి 22 : వేసవి కాలం వస్తున్నందున గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కళ్యాణ్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని జనగామ గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించడం కోసం పైపుల లీకేజీలకు మరమ్మతులు పూర్తి చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 22 : మండలం కేంద్రంలోని భవిత భవనంలో గురువారం దివ్యాంగులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఎనిమిది మంది దివ్యాంగులకు ఫిజియోథెరపిస్టు గంగాధర్ వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి గురువారం భవిత భవనంలో నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిసోర్సు పర్సన్ వసంత్‌కుమార్, దివ్యాంగులు, తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు గంగాధర్

సెలఫోన్ అందజేత

నిజాంసాగర్, ఫిబ్రవరి 22: మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన రోహిత్ 15 రోజుల క్రితం తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీంతో తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజేశ్వర్ గురువారం తెలిపారు. బాధితుడి పిర్యాదు మేరకు సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను కనిపెట్టి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

నిజాంసాగర్, ఫిబ్రవరి 22: నిజాంసాగర్‌లో ఏఎస్సై రాజేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ లేని వాహనదారులతోపాటు నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని మొత్తం 26 వాహనాలకు మొత్తం రూ.3,110 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనం నడిపిన ఒకరిపై కేసు నమోదు చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుడిసె దగ్ధం.. రూ.లక్షా60వేల ఆస్తినష్టం

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్ధమైన ఘటన జాన్‌కంపల్లి ఖుర్దు తండాలో గురువారం జరిగింది. ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జాన్‌కంపల్లిఖుర్దు తండాకు చెందిన మూడ్ భిక్ష్యా అతని భార్య రేణుక ఉపాధి కోసం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లగా.. ఇంటి వద్ద వారి పిల్లలు నవీన్, రాంచందర్, శ్రీచరణ్ ఉన్నారు. గురువారం మధ్యాహ్నం పిల్లలు ఇంట్లో భోజనం చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. మంటలు చెలరేగడంతో పిల్లలు అరుస్తూ ఇంట్లో నుంచి బయటికి పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.లక్షా60వేల ఆస్తినష్టం జరిగినట్లు గిర్దావర్ శ్రీనివాస్ తెలిపారు.

జీపీ రికార్డులను తనిఖీ చేసిన డీఎల్పీవో

జీపీ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్పీవో

మద్నూర్, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీని బాన్సువాడ డీఎల్పీవో నాగరాజు గురువారం తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వేసవికాలం వస్తున్నందున తాగునీటి ఎద్దడి రాకుండా జాగ్రత్త పడాలన్నారు. పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పంచాయతీ ప్రత్యేకాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, కార్యదర్శి సందీప్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

వైభవంగా శివాజీ జయంతి

శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న హన్మంత్‌షిండే

మద్నూర్, ఫిబ్రవరి 22: మండలకేంద్రంలో గురువారం ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని వైభవంగా నిర్వహించారు. పాతబస్టాండ్ వద్ద జెండా ఎగురవేసి శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు హన్మంత్‌షిండే, అరుణతారా తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో సోదాలు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: ఎల్లారెడ్డిలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇండ్లల్లో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వ్యాపారుల ఇండ్లల్లో సోదాలు నిర్వహించి లభించిన నగదు, డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఉన్నతాధికారులకు అప్పగిస్తామని సీఐ రవీంద్రనాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై బొజ్జ మహేశ్, హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్, కానిస్టేబుళ్లు రాధాక్రిష్ణ, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

'డంపింగ్'పై నిర్లక్ష్యం

- నిరుపయోగంగా డంపింగ్ యార్డులు
- పల్లెల్లో కానరాని పరిశుభ్రత
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

రోడ్డు పక్కనే చెత్తను వేసి కాల్చివేయడంతో ఏర్పడిన కాలుష్యం(ఫైల్)

డోంగ్లీలో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

డోంగ్లీ, ఫిబ్రవరి 22: పల్లెల్లో కాలుష్యాన్ని నివారించడానికి, పరిశుభ్రతను పెంచేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సంకల్పించింది. ఇండ్లలోని చెత్తను రోడ్లపై వేయకుండా.. ఇంటికి వచ్చే చెత్త సేకరణ ట్రాక్టర్‌కు అందజేయాలని సూచించింది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి అక్కడ సేంద్రియ ఎరువులను తయారు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం తడి, పొడి చెత్తను వేరు చేసి రెండు చెత్త బుట్టల్లో వేయాలని ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువు తయారీతో గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతున్నదని ఆశించింది. కానీ.. అధికారుల పర్యవేక్షణ లోపం, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం, ప్రజల పట్టింపులేని తనంతో ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. డంపింగ్ యార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం కనిపించడం లేదు.

రూ.2.50లక్షలతో డంపింగ్ యార్డు నిర్మాణం..

ప్రభుత్వం రూ.2.50లక్షలను వెచ్చించి గ్రామానికి ఒక డంపింగ్ యార్డును నిర్మించింది. ఇందుకు సంబంధించిన నిధులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించారు. మండలంలో మొత్తం 13 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని జీపీల్లో వీటి నిర్మాణం పూర్తయ్యింది. డంపింగ్ యార్డులో తడి, పొడి, సీసం, గాజు, అట్టపేపర్‌ను వేర్వేరుగా నిల్వ ఉంచేలా అరలను నిర్మించారు. అందులో వేసిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించడానికి లక్షల రూపాయలు వెచ్చించి ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో గ్రేడింగ్ చేయడం లేదు. రోజుల తరబడి అలాగే వదిలివేయడంతో దుర్వాసన వస్తున్నది. సమీపంలో పొలాలు ఉన్న వ్యవసాయదారులు, అటువైపు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అగ్ని ప్రమాదాలకు అవకాశం..

కొన్ని గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించకుండా.. రోడ్డు పక్కన వేస్తున్నారు. దాన్ని కాల్చివేస్తున్నారు. నిప్పు రవ్వలు పొలాల్లో పడి అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నదని రైతులు వాపోతున్నారు. డంపింగ్ యార్డును సద్వినియోగం చేసుకొని గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చాల్సి ఉండగా.. అలాంటి పనులను ఎక్కడా చేపట్టడం లేదు. చెత్త నిర్వహణపై అధికారులకు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. ఈ విషయమై మండల పరిషత్ అధికారి వెంకటనర్సయ్యను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతామని అన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొనారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

సాయిబాబు(ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: కుటుంబ కలహాలతో ఓ యువకుడు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకున్నది. ఎస్సై బొజ్జ మహేశ్ తెకథనం ప్రకారం.. లింగంపేట మండలం శట్పల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన చాకలి సాయిబాబు (30) ఎల్లారెడ్డి మండలం జంగమాయిపల్లి గ్రామానికి ఇల్లరికం వెళ్లి కళవ్వను పెండ్లి చేసుకున్నాడు. కొంత కాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన అతడు బుధవారం ఇంట్లో నుంచి వెళ్లాడు. గ్రామ శివారులోని బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. శవం గురువారం నీటిపై తేలడంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడి భార్య కళవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి మూడు నెలల కూతురు ఉన్నదని గ్రామస్తులు తెలిపారు.

గద్దగుండు తండాలో పైప్‌లైన్ ఏర్పాటు

పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

పిట్లం, ఫిబ్రవరి 22: మండలంలోని గద్దగుండు తండాలో తాగునీటి ఎద్దడి తీర్చేందుకు జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి జిల్లాపరిషత్ నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయించారు. ఆ నిధులతో పిట్లం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీ హనుమాన్ ఆలయం వద్ద గల బోరు బావి నుంచి గద్దగుండు తండావరకు నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయించి తండాలో నీటి ఎద్దడి తీర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు జంబిగ హన్మండ్లు, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, రవీంధర్‌నాయక్, రహిమతుల్లా, లక్ష్మారెడ్డి, బాబు మేస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

ప్యాడ్‌లు, పెన్నులతో ఖండేబల్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

నిజాంసాగర్, ఫిబ్రవరి22: జుక్కల్ మండలంలోని ఖండెబల్లూర్, కౌలాస్ గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు జుక్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరవింద్, సిబ్బంది కలిసి పరీక్షా ప్యాడ్‌లతోపాటు పెన్నులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, పాస్ అయిన అనంతరం తమ కాలేజీలో ఇంటర్ విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాతో కుటుంబానికి రక్షణ కల్పించాలి



బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్ అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: పోస్టల్ శాఖలో ఉన్న బీమా పాలసీలు చేసి తమ కుటుంబాలకు రక్షణ కల్పించాలని పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాలికల)లో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట మండలాలకు చెందిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లతో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పోస్టల్ బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నాగిరెడ్డిపేట మండలం పోచారం గ్రామానికి చెందిన పుప్పాల బాబు గత ఏడాది ఆగస్టులో జరిగిన ప్రమాదంలో మరణించాడు. అతడికి మంజూరైన రూ.పది లక్షల చెక్కును మృతుడి భార్య రేఖకు అందజేశారు. ఏఎస్‌పీ భూమన్న, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్ జిల్లా మేనేజర్ పవన్‌రెడ్డి, ఎల్లారెడ్డి పోస్టల్ సిబ్బంది, మూడు మండలాల బీపీఎంలు పాల్గొన్నారు.

అంజనాద్రి ఆలయానికి గోమాత దానం

నిజాంసాగర్, ఫిబ్రవరి 22: మండలంలోని బ్రాహ్మణపల్లి గేటు వద్ద జాతీయ రహదారిపై ఉన్న అంజనాద్రి ఆలయానికి పోతంగల్ గ్రామానికి చెందిన మనూ చౌదరి కుటుంబీకులు గోమాతను బహూకరించారు. దీంతో గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో వారిని దంపతులను సన్మానించారు. భక్తులు మల్లేశం, మొగులయ్య, విఠల్ తదితరులు ఉన్నారు.

మిషన్ ఎడ్యుకేషన్ పోస్టర్ల ఆవిష్కరణ

పిట్లం, ఫిబ్రవరి 22: మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో మిషన్ ఎడ్య